ఆధునిక హంగులు.. అత్యాధునిక వైద్య సేవలు

వనస్థలిపురం ఏరియా ఆసుపత్రికి మహర్దశ

- మహేశ్వరం వైద్య కళాశాల పరిధిలోకి..
- పెరగనున్న పడకల సంఖ్య
- సిటీస్కాన్, బ్లడ్ బ్యాంకు సౌకర్యాలు



వనస్థలిపురం: వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిని మహేశ్వరం ప్రభుత్వ వైద్య కళాశాల పరిధిలోకి తీసుకువచ్చారు. దీంతో ఏరియా ఆస్పత్రిలో అవసరమైన మార్పులు, చేర్పులు చేస్తున్నారు. నూతన ఫర్నిచర్, ఇతర సామగ్రిని చేరవేస్తున్నారు. దాదాపు 16 విభాగాలకు చెందిన సుమారు 120 మంది ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఇతర వైద్య నిపుణులు నియమితులయ్యారు. వీరంతా త్వరలో స్థానికంగా అందుబాటులో ఉండనున్నారు. కాగా నర్సులు, కిందిస్థాయి సిబ్బంది నియామకం జరగాల్సి ఉంది. ఇక త్వరలోనే 24 గంటలు అత్యవసర వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయని, మరికొన్ని రోజుల్లో వైద్య కళాశాలకు చెందిన విద్యార్థులకు ఇక్కడ బోధన ప్రారంభమవుతుందని వైద్యాధికారులు పేర్కొంటున్నారు.

220 పడకలు.. 16 రకాల వైద్య సేవలు..

ప్రస్తుతం ఆసుపత్రిలో ఉన్న 100 పడకలు 220కి పెరగనున్నట్లు వైద్యాధికారులు వెల్లడించారు. త్వరలో ఆస్పత్రిలో సిటీస్కాన్, బ్లడ్ బ్యాంకు సౌకర్యాలు ఏర్పాటు కానున్నాయి. ఏవి ఎక్కడ ఏర్పాటు చేయాలన్న విషయమై సంబంధిత అధికారులు పరిశీలన జరుపుతున్నారు. ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలు కల్పించడం కోసం సరిపడా స్థలాన్ని దృష్టిలో ఉంచుకుని ఆస్పత్రి భవనంలో కొనసాగుతున్న ఈహెచ్‌ఎస్, జేహెచ్‌ఎస్ వెల్‌నెస్ సెంటర్‌ను మరో చోటుకు తరలించాలని నిర్ణయించారు. వైద్య కళాశాల పరిధిలోకి ఆస్పత్రిని తీసుకురావడంతో ఇక్కడ 16 రకాల వైద్య సేవలకు సంబంధించిన వైద్యులు అందుబాటులో ఉంటారని అధికారులు తెలిపారు. క్లిష్టమైన శస్త్ర చికిత్సలు, ప్రత్యేకమైన వైద్య సేవల కోసం గతంలో కోఠి, ఉస్మానియా, గాంధీ ఆస్పత్రులకు వెళ్లాల్సిన అవసరం ఉండేదని, ఆ ఇబ్బందులు లేకుండా ఇకపై ఇక్కడే ఆయా శస్త్ర చికిత్సలు అందుబాటులోకి రానున్నాయి.





ఏరియా ఆసుపత్రిలో నూతన ఫర్నిచర్, వీల్‌చైర్లు

ఈహెచ్‌ఎస్, జేహెచ్‌ఎస్ వెల్‌నెస్ సెంటర్ దారెటో?

వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిని మహేశ్వరం వైద్య కళాశాల పరిధిలోకి తీసుకురావడంతో ఇక్కడ పడకల సంఖ్య పెంచుతుండడం, మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి రానుండడంతో స్థలాన్ని దృష్టిలో ఉంచుకుని ఇక్కడ ఉన్న ఈహెచ్‌ఎస్, జేహెచ్‌ఎస్ వెల్‌నెస్ సెంటర్‌ను వేరే చోటుకు తరలించాలని వైద్యాధికారులు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఈ సెంటర్‌లో చికిత్స పొందే రిటైర్డు ఉద్యోగులు సెంటర్ ఎక్కడికి వెళ్తుందో అని ఆందోళన చెందుతున్నారు. వనస్థలిపురం, పరిసర ప్రాంతాల్లో రిటైర్డు ఉద్యోగులు ఎక్కువగా ఉండడంతో సెంటర్ ఇక్కడి నుంచి తరలిస్తే వారికి ఇబ్బందులు తలెత్తనున్నాయి. కాగా ఈహెచ్‌ఎస్, జెహెచ్‌ఎస్ వెల్‌నెస్ సెంటర్ కోసం స్థానికంగా ఎన్జీవోస్‌కాలనీలో ఉన్న మోడల్ మార్కెట్ భవనం, అలాగే సచివాలయనగర్‌లో ఉన్న సీనియర్ సిటిజన్స్ ఫోరం భవనం, ఇతర భవనాలను వైద్యాధికారులు పరిశీలించారు. త్వరలోనే సరైన భవనం దొరికితే వెల్‌నెస్ సెంటర్‌ను అక్కడికి తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

వైద్య సేవలు మరింత విస్తృతం..

ఆస్పత్రి వైద్య కళాశాలకు అనుబంధంగా మారినందున ఇక్కడికి అన్ని విభాగాలకు చెందిన వైద్యులు పోస్టింగ్‌పై రానున్నారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన వైద్యులు చాలా మంది ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లారు. మిగిలిన కొంత మంది సైతం త్వరలోనే వెళ్లిపోతారు. ఇక నుంచి వైద్య కళాశాలకు అవసరమైన వైద్యులు, సిబ్బంది మాత్రమే ఇక్కడ విధుల్లో ఉంటారు. పూర్తిస్థాయి సిబ్బంది వచ్చిన తర్వాత ఇక్కడ వైద్యసేవలు మరింత విస్తృతం కానున్నాయి.

–డా.నాగేందర్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్, ఆసుపత్రి సూపరింటెండెంట్

అమిత్‌షాను మంత్రివర్గం నుంచి తొలగించాలి

మన్సూరాబాద్: డాక్టర్ అంబేడ్కర్‌ను అవమానపరిచేలా మాట్లాడిన కేంద్రమంత్రి అమిత్‌షా దేశప్రజలకు క్షమాపణలు చెప్పాలని మాలల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బేర బాలకిషన్ (బాలన్న) డిమాండ్ చేశారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గం మాల సంఘాల జేఏసీ అధ్యక్షుడు నర్సింగ్‌రావు, ప్రధాన కార్యదర్శి జంగిలి కిషన్ ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి శుక్రవారం పాలాభిషేకం చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన బాలకిషన్ మాట్లాడుతూ.. అంబేడ్కర్‌ను అవమానపర్చిన అమిత్‌షాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చంద్రమోహన్, శివశంకర్, కట్టవెంకటేష్, మిద్దెల నర్సింహ్మా, నల్లాల కుమార్, సంతోష్, మల్లేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

దిల్‌సుఖ్‌నగర్: కేంద్రమంత్రి అమిత్ షాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని ఆర్‌కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం ఎన్టీఆర్‌నగర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పున్నగణేష్ నేత, ఉపేందర్ రెడ్డి, తల్లాటి రమేష్ నేత, సురేందర్ రెడ్డి,శివ, అక్బర్, ప్రేమ్ నాయక్, మహమ్మద్, డక్కియార్ నాయక్, లింగస్వామి గౌడ్, జెల్ల జగన్నాథం, పటేల్, క్రిష్ణయ్య, శ్యామ్ గౌడ్ పాల్గొన్నారు.

నిధుల మంజూరుకు వినతి

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని కాలనీల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ శుక్రవారం ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ..డివిజన్ పరిధిలోని హనుమాన్‌నగర్‌కాలనీ, భాగ్యనగర్‌కాలనీ పేస్–1, శ్రీరమణకాలనీ ఫేజ్–1లో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని కోరగా త్వరలోనే నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిపారని కార్పొరేటర్ వెల్లడించారు.

మైనర్‌పై లైంగికదాడి కేసులో యువకుడికి పదేళ్ల జైలు

రంగారెడ్డి కోర్టులు: మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి లైంగిక దాడికి పాల్పడిన యువకుడికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించారు. కోర్టు ఏపీపీ సునితాబర్ల వివరాల ప్రకారం.. వనస్థలిపురం పరిధిలో నివాసముంటున్న మైనర్ (16) బాలికకు, సాహెబ్‌నగర్ చెందిన గుంజ గురుస్వామి (24) ప్రేమ, పెళ్లి అనే మాయమాటలు చెప్పి 2017 ఫిబ్రవరి 20న కర్ణాటక ప్రాంతానికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడని బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్షులను విచారించిన రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి యం.కె.పద్మావతి. శుక్రవారం నిందితుడికి జైలుశిక్ష, బాధితురాలికి రూ. 5లక్షల నష్టపరిహారం చెల్లించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు సిఫార్సు చేస్తూ తీర్పునిచ్చారు.

ఆయువు తీసిన ఆన్‌లైన్ బెట్టింగ్



సాయి కిరణ్

మహేశ్వరం: ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యసనం ఓ విద్యార్థి ఆయువు తీసిన ఘటన మహేశ్వరంలో చోటు చేసుకుంది. సీఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. మహేశ్వరం గ్రామం పోచమ్మ బస్తీకి చెందిన వెదిరె సాయి కిరణ్ (22) నారాయణగూడలోని అవినాష్ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కొన్ని రోజులుగా సాయి కిరణ్ ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడుతూ అప్పులు చేశాడు. అప్పులు పెరిగిపోవడం.. ఇచ్చినవారు ఒత్తిడి చేస్తుండడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. గురువారం తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లగా ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. గమనించిన స్థానికులు మంటలు ఆర్పి ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు.

బాలికలు, మహిళలను వేధిస్తే చర్యలు తప్పవు

నాగోలు: బాలికలు, మహిళలను వేధిస్తే చర్యలు తప్పవని షీ టీమ్స్ పోలీసులు హెచ్చరించారు. రాచకొండ ఉమెన్ సేఫ్టీ వింగ్, షీ టీమ్స్ ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్ సీపీ రాచకొండ కార్యాలయంలో శుక్రవారం ఈవ్ టీజర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. కమిషనరేట్ పరిధిలో మహిళలు, యువతులను వేధింపులకు గురి చేస్తున్న 157 (మేజర్లు–84, మైనర్లు–73) మందిని షీ టీమ్స్ పట్టుకుని వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించినట్లు ఉమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ టి. ఉషా విశ్వనాథ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ ఇన్‌స్పెక్టర్ ముని, అడ్మిన్ ఎస్సై రాజు పాల్గొన్నారు.

దాతల సహకారంతో భక్తులకు మెరుగైన సౌకర్యాలు



చంపాపేట: దాతల సహాయ, సహకారాలతో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించటం జరుగుతుందని కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి ఆలయ ఈఓ లావణ్య స్పష్టం చేశారు. ఆలయ ప్రాంగణంలో దాతల సహకారంతో ప్రారంభించనున్న పలు అభివృద్ధి పనులకు శుక్రవారం ఆమె శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఆలయ ప్రాంగణంలోని సత్యనారాయణ స్వామి వ్రత మండపంలో శిథిలావస్థకు చేరిన ఫ్లోరింగ్ స్థానంలో దాత ముఖేష్ కుమార్, శ్రీవిశ్వనాథ ఆలయంలో గ్రానైట్ ఫ్లోరింగ్‌కు దాత గూడూరు సంజయ్, ఆలయ ప్రాంగణంలో నీటి సరఫరా పైప్‌లైన్ ఏర్పాటుకు దాత సోమలింగం గౌడ్, హోమశాలలో ఫ్లోరింగ్ ఏర్పాటుకు దాత శ్రీనివాసరెడ్డి ముందుకు రావటం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా లావణ్య, దాతలను సన్మానించారు.

సన్మానం

సైదాబాద్: జీహెచ్‌ఎంసీ మలక్‌పేట సర్కిల్–6 నూతన ఏఎంహెచ్‌ఓ శ్రీనివాస్ రుద్రను ఐఎన్‌టీయూసీ అనుబంధ సంస్థ తెలంగాణ జీహెచ్‌ఎంసీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు సన్మానించారు. మలక్‌పేట ఏఎంహెచ్‌ఓగా విధులు నిర్వహించిన అనురాధ బదిలీపై ఫలక్‌నుమాకు వెళ్లగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఏఎంహెచ్‌ఓ శ్రీనివాస్ రుద్రను శుక్రవారం ఉద్యోగులు సన్మానించారు.

ప్రభుత్వ పథకాల అమలుపై సమాచారం ఇవ్వండి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న కోట్ల శ్రీనివాస్

సైదాబాద్: ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, లబ్ధిదారులతో నిర్వహించే కార్యక్రమాల గురించి నాయకులకు కూడా సమాచారం ఇవ్వాలని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ కోరారు. శుక్రవారం ఆయన కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి చంపాపేటలోని సైదాబాద్ మండల కార్యాలయంలో తహసీల్దార్ జయశ్రీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఇటీవల సైదాబాద్ మండల పరిధిలో పాఠశాల విద్యార్థులకు సీఎం క్రికెట్ కప్, పలువురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ తదితర కార్యక్రమాలు నిర్వహించినా మండలం పరిధిలో ఉండే టీపీసీసీ, గ్రేటర్ కాంగ్రెస్, జిల్లా మార్కెట్ కమిటీ ప్రతినిధులకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని తెలిపారు. ప్రభుత్వ అభివృద్ధిలో అందరినీ భాగస్వాములను చేయాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో కోట్ల లడ్డూపటేల్, శ్రీరాములు, కృష్ణ పాల్గొన్నారు.

సందడిగా క్రిస్మస్ వేడుకలు

సైదాబాద్: కులమతాలకు అతీతంగా పర్వదినాల వేడుకలు నిర్వహించడం ద్వారా ఉద్యోగులు, కార్మికుల్లో సోదరభావం పెరుగుతుందని హైదరాబాద్ సౌత్ సర్కిల్ ఎస్ఈ సోమిరెడ్డి అన్నారు. ఆస్మాన్‌గఢ్‌లోని సిటీ–8 విద్యుత్ డివిజనల్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యుత్ ఉద్యోగులు కార్మికులు కలిసి క్రిస్మస్ వేడుకలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. రాక్‌చర్చి పాస్టర్ బిషప్ తిమోతి మాట్లాడుతూ.. సకల మానవాళి శ్రేయస్సు కోసం యేసుక్రీస్తు జన్మించారని, ఆయన బోధనలు సమాజానికి దిక్సూచి అన్నారు. అనంతరం అధికారులు, కార్మికులు కలిసి కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. డీఈలు విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రాంబాబు, ఫరాత్‌అలీ, ఏఈలు సత్యనారాయణ, ప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, నిర్వాహకులు జయపుత్ర, ప్రేమ్‌విజయ్, తైసీస్, రామకృష్ణానంద్, రామకృష్ణ, రాము, విజయ్, దాస్, ప్రభాకర్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



దిల్‌సుఖ్‌నగర్: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు క్రీడలు దోహదపడుతాయని హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజుగౌడ్ అన్నారు. ఆర్‌కేపురం భాష్యం పాఠశాల విద్యార్థులకు మూడ్రోజుల క్రికెట్ క్రీడా పోటీలు నిర్వహించారు. శుక్రవారం జరిగిన ముగింపు కార్యక్రమానికి నాగరాజుగౌడ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమని, ఆసక్తి ఉన్న క్రీడల్లో రాణించాలన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ప్రిన్సిపాల్ అప్పారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పార్కుల్లో మౌలిక వసతులు కల్పిస్తాం

సైదాబాద్: డివిజన్ పరిధిలోని పార్కుల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. సైదాబాద్ డివిజన్ పరిధిలోని ఎస్‌బీహెచ్–ఏ, ఎస్‌బీహెచ్–సీ కాలనీల్లోని పార్కుల్లో చిన్నారుల ఆటవస్తువుల పరికరాల ఏర్పాటు పనులను శుక్రవారం కార్పొరేటర్ జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పార్కుల్లో చిన్నారులకు ప్రత్యేకంగా ఆట పరికరాలు ఏర్పాటు చేయిస్తున్నామని, దాంతో పార్కులకు వచ్చేందుకు చిన్నారులు ఆసక్తి పెంచుకుంటారన్నారు.

హ్యాండీ క్రాఫ్ట్ మేళాకు స్పందన

వనస్థలిపురం: వనస్థలిపురం హుడా ఓపెన్ ఆడిటోరియం గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్ మేళాకు స్పందన వస్తోంది. మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైనర్, కాంతా వర్క్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్, లినెన్, కలంకారీ, బెంగాల్ కాటన్, లక్నో చికాన్, బనారస్ చీరలు, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌస్, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జువెలరీ, జైపూర్ బెడ్‌షీట్స్, కొండపల్లి బొమ్మలు, తగ్గింపు ధరలకు లభిస్తాయని నిర్వాహకులు అక్బర్ అలీ తెలిపారు. జనవరి 12 వరకు ఎగ్జిబిషన్ కొనసాగుతుందని స్థానికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



మేళాలో కొనుగోలుదారుల సందడి



హస్తినాపురం ఈస్ట్‌క్రెస్ట్‌లో శుక్రవారం ప్రణవ్‌గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి అభిషేకం, పడిపూజలో చైర్మన్ రవికుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాంబాబు, చంద్రమౌళి గురుస్వామి, చంద్రమౌళి వెంకటేష్, గురుస్వామి బండారి అశోక్‌గుప్తా, శ్రీనివాస్ గుప్తా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. –సాక్షి, సిటీబ్యూరో